www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 మే 2023

5

ఏలూరు



'పోలవరం' నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం తగదు

కుక్కునూరు: పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు విమర్శించారు. శనివారం సిపిఎం మండల కమిటీ సమావేశం మేడిపల్లి బాబు అధ్యక్షతన మాధవరంలో జరిగింది. ఈ సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడిగా చెప్పబడుతున్న పోలవరం ప్రాజెక్ట్ కోసం తమ సర్వస్వాన్ని కోల్పోతున్న నిర్వాసితులకు తొలిప్రాధాన్యత లేకుండా పునరావాసం, పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించకుండా ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారని, ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తికాకుండానే ఇప్పటికే వేలాది కుటుంబాలు నీట మునిగిపోయి నష్టపోయారని తెలిపారు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదలకు మండలం పూర్తిగా ముంపునకు గురైందని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. మళ్లీ గోదావరి వరదల సమయం రావడంతో నిర్వాసితుల హక్కులు సాధించుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో జూన్ 20 నుండి మహాపాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కోటా రామలక్ష్మి, వై.సాయికిరణ్, పి.లక్ష్మయ్య, ఎస్.లక్ష్మణరావు. బి.శ్రీను, మోహన్‌రావు, వలీ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు వేళాయే..!

1న కాలువలకు నీరు విడుదల

రైతులను వెంటాడుతున్న సమస్యలు

విత్తనాలపై నామమాత్రపు సబ్సిడీతో మమ

కౌలురైతులకు సకాలంలో రుణాలు ఇస్తారా

ఆధునికీకరణ లేక ఈ ఏడాదీ రైతులకు కష్టాలే

ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించేనా



ధవళేశ్వరం ఆనకట్ట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు సంబంధించి జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ శాఖ సిద్ధమవుతోంది. రబీసాగులో ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఖరీఫ్ సాగులో ఎదురుకానున్న సమస్యలపై కలత చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో వరి సాగవనుంది. దీనికి సంబంధించి విత్తనాలు దాదాపు 70 శాతానికిపైగా రైతు నుంచి రైతుకు మార్పిడి జరుగుతోంది. 30 శాతం మంది రైతులు విత్తన షాపుల్లో కొనుగోలు చేసుకునే పరిస్థితి ఉంది. తమది రైతు ప్రభుత్వమని చెప్పడం తప్ప విత్తనాల సరఫరాలో రైతులకు సబ్సిడీ అనేది పెద్దగా లేకుండాపోయింది. విత్తనాలకు సంబంధించి కిలోకు రూ.ఐదు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. 30 కిలోల విత్తన బస్తా దాదాపు రూ.1100 వరకూ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.150 కూడా ఉండటం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విత్తనాలకు సంబంధించి 50 శాతం సబ్సిడీ అమలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విత్తన కొనుగోలు రైతులకు భారంగా మారింది. ప్రభుత్వం విత్తన సబ్సిడీ పెద్దగా ఇవ్వకపోవడంతో విత్తనాలు విక్రయించే రైతులు సైతం ధర ఎక్కువగా నిర్ణయిస్తున్నారు. 75 కిలోల విత్తనాలు రూ.రెండు వేలకుపైగానే చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తే రైతులకు ఎంతగానో మేలు జరిగే అవకాశమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కౌలు రైతులకు రుణాలిచ్చేనా..?

రెండు జిల్లాల్లోనూ వ్యవసాయ సాగులో కౌలు రైతులదే కీలక పాత్ర. దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారని, 70 శాతం సాగు వీరే చేస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి. సాగు చేసే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎటువంటి మేలూ జరగడం లేదు. భూయజమాని అంగీకారం లేకుండా కౌలుకార్డులు ఇవ్వడం లేదు. కౌలుకార్డులు లేవనే సాకుతో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఎకరాకు రూ.35 వేల వరకూ వరిసాగులో పెట్టుబడి ఖర్చవుతోంది. ప్రతి రైతూ రెండెకరాల నుంచి ఐదెకరాల వరకూ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. అయితే బ్యాంకులు ఇచ్చే పంటరుణాలు మాత్రం కౌలురైతులకు అందడం లేదు. కౌలుకార్డులు అందించే ప్రక్రియ సైతం నిబద్ధతతో అమలు చేయని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా సకాలంలో కౌలుకార్డులు అందించి ఖరీఫ్ సాగుకు అవసరమైన రుణాలు కౌలురైతులకు అందించేనా అనే అనుమానం నెలకొంది. కౌలురైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

వెంటాడనున్న ఆధునికీకరణ సమస్య

రెండు జిల్లాల్లో 11 ప్రధాన కాలువలు 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. ప్రభుత్వం కాలువల ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గడిచిన మూడేళ్లుగా తూడు తీయడం వంటి చిన్నచిన్న పనులు మినహా పూడికతీత, షట్టర్ల మరమ్మతులు వంటి పనులు జరగని పరిస్థితి నెలకొంది. దాదాపు రూ.వెయ్యి కోట్లకు సంబంధించిన ఆధునికీకరణ పనులు అలానే ఉండిపోయాయి. వర్షాలు కురిస్తే నారుమడులు, నాట్లు నాటిన పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఈ ఏడాది రైతులు ఆధునికీకరణ లేమి సమస్యలను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడనుంది.

ముందస్తు సాగుపై అవగాహన కల్పించేనా..?

ప్రతియేటా జూన్ ఒకటో తేదీన సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు మాత్రం ఆలస్యంగా వేస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ప్రధాన కారణం రైతులకు అవగాహన కల్పించకపోవడమేనని చెప్పొచ్చు. ఖరీఫ్ నారుమడులు ఆలస్యం కావడంతో డిసెంబర్ నెలాఖరు వరకూ ఖరీఫ్ మాసూళ్లు సాగుతున్నాయి. దీంతో రబీసాగు ఆలస్యమవుతోంది. ప్రస్తుత ఏడాదినే తీసుకుంటే ఈ నెల 20వ తేదీ వచ్చేవరకూ రబీ మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి. మే నెలలో వచ్చిన అకాల వర్షాలకు రబీ పంట దొరికిపోయింది. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఖరీఫ్‌లో ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కాలువలకు నీరు విడుదలైన తర్వాత నారుమడులు త్వరితగతిన వేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందించాలి

కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి

ఖరీఫ్ సాగులో 50 శాతం సబ్సిడీపై రైతులకు అవసరమైన విత్తనాలు అందించాలి. రైతులకు విత్తన సబ్సిడీ అనేది అందకుండా పోతుంది. నాణ్యమైన విత్తనాలు దొరకకపోతే తెగుళ్లబారిన పడి రైతులు పంటను కోల్పోయే ప్రమాదం ఉంది. భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ రైతుభరోసా కేంద్రాల ద్వారా కౌలు కార్డులు అందించి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రాంతీయ సదస్సులో అమరావతి జెఎసి చైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రావు



ప్రాంతీయ సదస్సుకు హాజరైన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ఎపిజెఎసి అమరావతి 80 రోజులుగా చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం కొన్ని ఆర్థిక, ఇతర సమస్యలకు ఒక్కొక్క దశ ఉద్యమంలో ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతూ ఉత్తర్వుల రూపంలో ఉద్యమ కాలంలో విడుదల చేసిందని, కేవలం ఉద్యమం ఫలితంగానే ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు పేర్కొన్నారు. శనివారం ఏలూరులోని టుబాకో మర్చెంట్స్ ఫంక్షన్ హాలులో ఎపిజెఎసి అమరావతి మూడో ప్రాంతీయ సదస్సు ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 80 రోజులుగా సమస్యలపై ఉద్యోగులు పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం ఏమీ తెలీదన్నట్లు, ఉద్యమం పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, ఉద్యమంపై స్పందించకుండా ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తుంటే ఉద్యమం అంత కసితో ఉధృతమవుతుందే తప్ప వెనుకడుగు వేసేది ఉండదని ఆయన తెలిపారు.

మొదటి దశ ఉద్యమం సందర్భంగా జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సొమ్ములు, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, కొత్త జిల్లాలకు 16 శాతం హెచ్ఆర్ఎ, ఆర్‌టిసి ఉద్యోగుల ఓటి డబ్బుల చెల్లింపు వంటి జిఒలు ఇచ్చిందని, ఈ జిఒలు విడుదలకు కారణం ఎపిజెఎసి అమరావతి పోరాటమేనన్న సంగతి ఉద్యోగులందరికీ తెలిసిందేనన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులు మరో చలో విజయవాడ పిలుపునివ్వకముందే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిజాయితీగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం సృష్టించిన ఉద్యోగులు లేని ఉద్యోగ సంఘం నాయకులతో తమ ఉద్యమంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో స్పష్టత వచ్చే వరకూ ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని దామోదర్‌రావు తెలిపారు. జెఎసి అసోసియేట్ రాష్ట్ర చైర్మన్ టివి.ఫణిపేర్రాజు, కోశాధికారి వివి.మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతు ప్రభుత్వం ఉద్యమాన్ని ఆపేందుకు ఎన్ని ఆటంకాలు సృష్టించి, ఎంత నిలువరించినా అంతకు రెట్టింపుగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తారని, అందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులంతా సిద్ధంగా ఉన్నరని వారు తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో మూడో దశలో ప్రాంతీయ సదస్సులు, అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఉద్యమంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. తొలుత స్థానిక పాతబస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ నుంచి ఉద్యోగులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సదస్సులో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్రప్రధానకార్యదర్శి సిహెచ్.కృష్ణమూర్తి, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.అర్లయ్య, ఎపి వర్కు ఆర్ట్స్, పిఇటి ఇన్‌స్ట్రక్టర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శివకుమార్ రెడ్డి, ఎస్‌బిటిఎస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు దేవి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్, విఆర్ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆంజనేయకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర నాయకులు జి.జ్యోతి, జెఎసి జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాంబాబు, జిల్లా చైర్మన్ శివశంకర్, కృష్ణాజిల్లా చైర్మన్ తోట వెంకటసతీష్, కర్నూలు జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి. ఉఐటియుసి రాష్ట్ర నాయకులు కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు, సిఐటియు రాష్ట్రనాయకులు బి.సోమయ్య మాట్లాడారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న గుడెల్లి వెంకట్రావు

వేసవి అలవెన్సులు కొనసాగించాలి

ప్రజాశక్తి - పోలవరం

ఉపాధి కూలీలకు పనిప్రదేశాల్లో కనీస అవసరాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం ఉపాధి పని ప్రదేశాల పర్యటనలో భాగంగా వింజరం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు వంటి కనీస అవసరాలు తీర్చడం లేదన్నారు. వేసవి అలవెన్సులు నిలిపివేయడం దారుణమన్నారు. పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. ఐదు కిలోమీటర్లు దాటి పని ప్రదేశాలకు వెళ్లే వారికి అదనంగా ఆటో ఛార్జీలు కలిపి ఇవ్వాలని, కానీ ఉపాధి కూలీలు వేతనాల్లోనే ఆటో కిరాయిలు కూడా చెల్లిస్తున్నారని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 93 శాతం హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 69 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన మొదటి సంవత్సరం గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 16,290 మందికి 15503 మంది హాజరయ్యారు. 787 మంది గైర్హాజరయ్యారు. 93 శాతం హాజరు నమోదైంది.ఇందులో సాధారణ విద్యార్థులు 15,460 మందికి 14,798 మంది హాజరు కాగా 662 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తివిద్యా విభాగంలో 830 మందికి 705 మంది హాజరు కాగా 125 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు మొత్తం 4,492 మందికి 4,130 మంది హాజరుకాగా 362 మంది గైర్హాజరయ్యారు. 91 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 4,021 మందికి 3,721 మంది హాజరు కాగా 300 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యావిభాగంలో 471 మందికి 409 మంది హాజరు కాగా 62 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

మూఢ విశ్వాసాలపై కందుకూరి పోరు చిరస్మరణీయం



కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

మంతమం నే ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజంలోని దురాచారాలపై విప్లవం ప్రారంభించి, మూఢ విశ్వాసాలు, సనాతన ఆచారాలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. శనివారం ఉదయం స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన కందుకూరి వీరేశలింగం వర్ధంతి జరిగింది. ముందుగా కందుకూరి చిత్రపటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు పూలదండవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ తెలుగు ప్రజలు గర్వించే వ్యక్తి, రచయత, సంఘ సంస్కర్త అభ్యుదయవాది కందుకూరి అని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమని తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనకు అకుంఠిత దీక్షతో పని చేశారని పేర్కొన్నారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు, వితంతు వివాహాల నిర్వహణకు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు. మతం ముసుగులోని దురాచారాలపై, మూఢ విశ్వాసాలపై ఆయన పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఎ.శ్యామలారాణి, పి.రామకృష్ణ, సిపిఎం నాయకులు లెనిన్, కట్టా సత్యనారాయణ, గోపి, త్రినాథ్, సత్యం పాల్గొన్నారు.

సమాజానికి చెడు చేస్తే ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సమాజానికి చెడు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని డిఎస్‌పి అశోక్ కుమార్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎంఆర్.అప్పారావు కాలనీలో గంజాయి, నాటుసారా, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకున్న నేపథ్యంలో శనివారం రాత్రి 17 మందితో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. వీరిలో 15 మంది స్థానికులు, ఇద్దరు మహిళా పోలీసులుంటారని డిఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు మూర్తి, అంకబాబు, నాయకుడు మస్తాన్ వలి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఉద్యానవన శాఖ ద్వారా ఔషధ జాతి మొక్కల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు నూజివీడు ఉద్యాన అధికారి ఆర్.హేమ తెలిపారు. శనివారం మండలంలోని పల్లెర్లమూడిలో తిప్పతీగ పెంపకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎకరాకు రూ.లక్ష రాయితీ ఉంటుందని తెలిపారు

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జగనన్న కాలనీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ అలీ ఖాన్ సూచించారు. నూజివీడు మండలం మర్రిబంధంలో శనివారం లబ్ధిదారులతో ఎంపిడిఒ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చినవెంకన్న నిత్యాన్నదానానికి రూ.1,00,016 విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ నిత్య అన్నదాన ట్రస్ట్‌కు గుంటూరు జిల్లా కొలనుకొండ గ్రామానికి చెందిన సామల వెంకట్రావు రూ.1,00,016 విరాళంను ఆలయ సూపరింటెండెంట్ ఐ.రమణరాజుకు శనివారం అందజేశారు. అనంతరం దాత, కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు విరాళానికి సంబంధించిన బాండ్‌ను వెంకట్రావుకు అందించారు.

ధాన్యం బకాయిలు చెల్లించండి

కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. శనివారం ఉంగుటూరులోని పంచాయతీ కార్యాలయం వద్ద గల కళ్యాణ మండపంలో ఎపి రైతుసంఘం, కౌలు రైతుల సంఘం మండలం ముఖ్యకార్యకర్తల సమావేశం కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. పలు రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు అమ్మిన ధాన్యానికి ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రైతు సంఘాలు చేస్తున్న ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్‌ను అందిస్తున్న ఎస్ఐ

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పోలవరం

యువత వ్యసనాల బారినపడకుండా, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని పోలవరం ఎస్ఐ ఎస్ఎస్.పవన్‌కుమార్ అన్నారు. శనివారం పోలవరం పంచాయతీ పరిధిలోని కమ్మరగూడేనికి చెందిన యువకులకు వాలీబాల్ నెట్‌ను, బాల్‌ను ఎస్ఐ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ఉదయం, సాయంత్రం ఆటలు ఆడితే యువకుల దేహదారుఢ్యం పెరగడంతోపాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. యువకుడు క్రమశిక్షణతో, బాధ్యతగా ఉండాలని చెప్పారు. చదువు పట్ల శ్రద్ధపెట్టి కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. యువత దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని వైసిపి నాయకులు సొబ్బన మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, వై.రాజు, సిబ్బంది వి.రమేష్, జి.నాగలక్ష్మి, పోలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్ బాబు, కుంజం నాగబాబు, క్రీడాకారులు దేశబత్తుల ప్రణీత్, కాకి అఖిల్, దోర్నాల సంగీత్ రాజ్, పాతాళ వెంకటేష్, చిన్నం బంగారం పాల్గొన్నారు.

కొల్లేరులో తవ్వుకో.. దండుకో..!

భారీగా చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధం

తాగునీటి అవసరాల పేరుతో అక్రమాలు

రాజకీయ ప్రతినిధుల కనుసన్నల్లో యథేచ్ఛగా తవ్వకాలు..!

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరును కొల్లగొట్టేందుకు కొందరు బడాబాబులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి తాగునీటి అవసరాలను తెరపైకి తెచ్చి కొల్లేరు ఐదో కాంటూరులో వేలాది ఎకరాల్లో చెరువులు తవ్వేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇంగిలంపాకలంక, పెనుమాకలంక, నందిగామలంక, మణుగూరు, పులపర్రు, చెంతపాడు, దయ్యంపాడు గ్రామాల్లో పెద్దఎత్తున చెరువుల తవ్వకానికి తెరలేపుతున్నట్లు తెలిసింది. ఉన్నతన్యాయస్థానం ఆదేశాలను 'కొల్లేరు'లో కలిపేస్తూ రాజకీయ నాయకులే ఈ తతంగమంతా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొల్లేరులో మళ్లీ ఆక్రమణలు పెరిగిపోయి, కాలుష్య కోరల్లో చిక్కుకుపోవడంతో పాటు గ్రామాలకు గ్రామాలే ముంపుబారిన పడి కొల్లేరు ప్రాంత ప్రజలు వలస బాటపట్టే ప్రమాదం పొంచి ఉంది. ఇదిలా ఉంటే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించైనా కొల్లేరు ఆక్రమణకు గురికాకుండా కాపాడుకుంటామని పర్యావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు స్పష్టం చేస్తున్నారు.

కొల్లేరు ప్రక్షాళన జరిగిందిలా..

కొల్లేరు తాగునీటి సరస్సు ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. సుమారు 150 దేశాలకు తలమానికమైన ఈ సరస్సు మండవల్లి మండలంలో ఇంగిలి పాకలంక, నందిగామలంక, పెనుమాకలంక, కొవ్వాడలంక, దయ్యంపాడు, చెంతపాడు, మనుగులూరు, తక్కెళ్లపాడు, పులపర్రు, నిచ్చుమిల్లి, పిల్లిపాడు తదితర గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అప్పటి సిఎం జలగం వెంగళరావు కొల్లేరు ప్రజలకు ఉపాధిని కల్పించేలా చేపల చెరువులను తవ్వించారు. ఇదే అదునుగా బడాబాబులు కొల్లేరుపై కన్నేసి పూర్తిస్థాయిలో ఆక్రమించేశారు. దీంతో కొల్లేరు ప్రజలకు జీవనభృతి లేక సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు సుమారు 63 డ్రెయిన్ల ద్వారా కొల్లేరులో చేరి ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చేరకుండా కొల్లేరు ఆక్రమించి తవ్విన చేపల చెరువులు అడ్డుపడేవి. దీంతో డ్రెయిన్లు పొంగి పట్టణాలు, గ్రామాలతో పాటు కొల్లేరు శివారు ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకుపోయేవి. ప్రధాన పంటలన్నీ మునిగిపోయి రైతులు నష్టపోయేవారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కొల్లేరును ప్రక్షాళన చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రజలకు ఉపాధి కలిగేలా కొల్లేరులో చెరువులను ధ్వంసం చేశారు. అనంతరం కొల్లేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టినప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రాలేదు.

ప్రక్షాళన అనంతరం ఏం జరిగింది..!

కొల్లేరు ఐదో కాంటూరులో ఆక్రమణలను తొలగించి చిత్తడి నేలలను పరిరక్షించే బాధ్యతను అటవీ శాఖ అధికారులకు అప్పగించింది. కొల్లేరులో ఎలాంటి అక్రమణలు జరగకుండా కఠినమైన ఆంక్షలు విధించారు. కానీ కొల్లేరును పరిరక్షించడంలో అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఆంక్షలన్నీ బుట్టదాఖలయ్యాయి. తాగునీటి అవసరాలను సాకుగా చూపి కొల్లేరులో అడ్డూఅదుపూ లేకుండా చేపల చెరువుల తవ్వకాలు చేపట్టారు. ఈ అక్రమాలను గుర్తించి వార్తలు రాసేందుకు వెళ్లిన పత్రికా ప్రతినిధులపైన కూడా దాడులకు తెగబడిన సందర్భాలున్నాయి.


ప్రస్తుత పరిస్థితులు ఇవి..

గత ప్రభుత్వంలోనే కొల్లేరు అన్యాక్రాంతమైందని విమర్శిస్తూనే నేటి ప్రభుత్వ ప్రతినిధులు అదే సాకును చూపిస్తూ గతంలో తవ్విన చెరువులను తలదన్నేలా కొల్లేరులో చేపల చెరువు తవ్వాలనే ప్రధాన లక్ష్యంగా కొందరు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా మనుగడ సాగించేందుకు తాగునీటి అవసరాల సాకుతో మిగిలిన కొల్లేరును ఆక్రమించడానికి ఇక్కడి రాజకీయ నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఈ తవ్వకాలపై వార్తలు రాయకుండా సహకరించాలని కోరుతూ మీడియా ప్రతినిధులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొల్లేరులో తవ్విన చేపల చెరువు వల్ల కొల్లేటి ప్రాంత ప్రజలకు ఉపాధి లేక వలసబాట పడుతుంటే కొల్లేరు ఆక్రమణదారులు, బడాబాబులు, దళారులు రూ.కోట్లకు పడగలెత్తారనే విమర్శలున్నాయి. ఇదంతా చూస్తుంటే రాజకీయ నాయకులకు ప్రజాసంక్షేమం కన్నా స్వార్థ రాజకీయం కోసం కొల్లేరును బడాబాబులకు కట్టబెట్టడమే ముఖ్య ఉద్దేశంగా ఉన్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. దీనిపై సెక్షన్ ఆఫీసర్ రామ్మోహన్ సింగ్‌ను వివరణ కోరగా చెరువుల తవ్వకాల్లో వాస్తవం లేదని, అన్నీ పుకార్లే అని చెప్పుకొచ్చారు. కొల్లేరులో అలాంటి తవ్వకాలు చేస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు.



సగం తవ్విన చేపల చెరువు

అభివృద్ధి పథంలో గుర్వాయిపాలెం జెడ్‌పి హైస్కూల్



సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా విద్యార్థులతో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - కలిదిండి

కార్పొరేట్‌కు దీటుగా ఏటేటా అభివృద్ధి పథంలో గుర్వాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొనసాగుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు బి.ప్రసన్నకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ 2017 ఏడాది అప్పర్ ప్రైమరీలో 107 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 2019-20 ఏడాది తొమ్మిదో తరగతి, 2020-21 ఏడాది పది వరకు ఉన్నతీకరణ పొందిందన్నారు. తొలి ఏడాదే పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 2018లో ప్రభుత్వ నిధులు రూ.25 లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరి, రూ.20 లక్షలతో మెయిన్ రోడ్డు నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తకుండా దాతల సాయంతో రూ.1.30 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ నెల కొల్పామన్నారు. నాడు - నేడు ఫేస్-1లో రూ.25 లక్షలతో బాలుర, బాలికల మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పన జరిగిందన్నారు. ప్రతి ఏటా ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్, ఇన్‌స్పైర్ అవార్డులను ఐదారుగురు విద్యార్థులు పొందుతున్నారన్నారు. ప్రతి ఏటా కాంప్లెక్స్, మండల, జిల్లా స్థాయిలో జరిగే వక్తృత్వ, వ్యాసరచన, సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధిస్తున్నామన్నారు. ఈ ఏడాది డ్రాయింగ్‌లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిని కలెక్టర్ వి.ప్రసన్నవెంకటేష్ చేతుల మీదుగా పొందామన్నారు. నేడు 260 మంది విద్యార్థులు ఉండడంతో ఫేస్-2లో రూ.1.62 కోట్లతో పది అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయన్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించడం వృత్తి పట్ల బాధ్యత మరింత పెంచిందన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నందున గుర్వాయి పాలెం పరిసర గ్రామాల్లోని విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రధానోపాధ్యాయులు బి.ప్రసన్నకుమారి కోరారు.



ప్రసన్నకుమారి



పాఠశాల ఉన్నతీకరణ ప్రారంభంలో ఎంఎల్‌ఎ డిఎన్ఆర్

సమాజ సేవకులను ప్రోత్సహించాలి

రోటరీ జిల్లా గవర్నర్ విశ్వవాథం భాస్కరరామ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సమాజ సేవలో ఉన్నవారిని ప్రోత్సహించాలని రోటరీ జిల్లా గవర్నర్ విశ్వనాథం భాస్కరరామ్ అన్నారు. రోటరీ కార్యదర్శి వూడా రామ్‌గోపాల్(గోపీ) అధ్యక్షతన స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సమావేశంలో భాస్కరరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాకారపు కృష్ణ విజ్ఞప్తి మేరకు లక్కవరం శ్మశానవాటిక అభివృద్ధికి తమ వ్యక్తిగత నిధుల నుంచి రూ.3 లక్షలు అందిస్తామని, పని ప్రగతి పరిశీలించి మరో రూ.లక్ష కూడా వ్యక్తిగత నిధుల నుంచి అందిస్తానని భాస్కరరాం తెలిపారు. అనంతరం రోటరీ ఓకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారాలను భాస్కరరామ్ చేతుల మీదుగా అందించారు. తొలుత జీవన సాఫల్య పురస్కారాన్ని కళారంగంలో విశేష సేవలందిస్తున్న కెఎన్ఆర్.ట్రస్ట్ వ్యవస్థాపకులు కాసర నర్సిరెడ్డికి అందించారు. అనంతరం వివిధ రంగాల్లో సమాజానికి విశేష సేవలందిస్తున్న మరో 14 మందికి పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలను హైదరాబాద్ భారతి ప్రాపర్టీస్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ సహకారంతో అందించారు. ఇటీవల రోటరీ నిర్వహించిన యువజనోత్సవాల విజేతలకు రోటరీ గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ బహుమతులను దాకారపు కృష్ణ, రాఘవరాజు ఆదివిష్ణు సంయుక్త సౌజన్యంతో అందించారు. అనంతరం రోటరీ సభ్యులు ధనకుమార్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. భాస్కరరాంతో పాటు రోటరీ ప్రతినిధులు రోటరీ ఫౌండేషన్‌కు 8 పిహెచ్ఎఫ్‌లు అందించిన సభ్యులకు ప్రసంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఊడ రామ్‌గోపాల్, చార్టర్ సెక్రటరీ ఎంఎస్ఆర్, గణిత ఆనంద ప్రసాద్, వెలివెల పెద్దిరాజు, అయినపర్తి చంద్రశేఖర్, కొమ్మకూరి నాగేశ్వరరావు, రొంగల దేవీప్రసాద్, బవిరిశెట్టి హనుమాన్ తిలక్ పాల్గొన్నారు.

ఆటో సరస్వతికి రోటరీ సత్కారం

పట్టణంలో మొ ట్టమొదటి మహిళా ఆటోడ్రైవర్ దాసరి సరస్వతిని రోటరీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ, కార్యదర్శి ఊడారాంగోపాల్ ఆధ్వర్యంలో పలు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి రోటరీ ఎక్సలెన్సి పురస్కారాలను అందించారు. ఈ నేపథ్యంలో మొట్టమొదటి మహిళా డ్రైవర్‌గా సేవలందిస్తున్న దాసరి సరస్వతిని పురస్కారానికి ఎంపికి చేసి రోటరీ జిల్లా గవర్నర్ విశ్వనాథం బాస్కరరామ్ చేతులమీదుగా శాలువాతో సత్కరించి పురస్కారం అందించారు.



ఆటో సరస్వతిని సత్కరిస్తున్న విశ్వనాథం భాస్కరరామ్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథ పాలకుడు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకుని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలిపారు.**మండవల్లి** : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎదుగుదలకు రమాబాయి శ్రమ, పట్టుదల, కృషి ఎంతో ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో త్యాగశీలి విశ్వమాత రమాబాయి 88వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ రమాబాయి సహాయ సహకారాలతోనే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించగలిగాడన్నారు. గ్రంథాలయాల్లో ఉన్న జ్ఞానాన్ని పెంపొందించుకుని ఆయన ప్రపంచ మేధావిగా ఎదిగారన్నారు. విద్యార్థులు కూడా సమ్మర్ క్యాంపులను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకొని మేధావులుగా, ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పరివిన, కుసుమ, సుష్మ పాల్గొన్నారు.



టి.నరసాపురంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కొరత లేదు

ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విద్యుత్ కొరత లేదని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు నానాటికి ఉధృతమవుతూ 50 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయని, ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. అధిక లోడు వల్ల 220 కెవి ఉండి ఇహెచ్‌టి సబ్ స్టేషన్‌లో మూడో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ అవుతుంది, ఉండి ఇహెచ్‌టి సబ్ స్టేషన్ నెటవర్క్ మార్పు చేయడంతో గణపవరం, నిడమర్రు, ఉండి, భీమవరం, పాలకోడేరు, కాళ్ల ఆకివీడు మండలాల్లో కొంత మేరకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయన్నారు. 220 కెవి వేమగిరి-దువ్వ ఫీడర్ ఓవర్‌లోడ్ అవ్వడం వల్ల పిప్పర, కాశిపాడు, అత్తిలి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి విద్యుత్ కొరత లేదని ఆ ప్రకటనలో తెలిపారు. ఎప్పుడైనా విద్యుత్ గ్రిడ్ ఫ్రీక్వెన్సీ ఎ50హెచ్‌జెడ్ కంటే తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ ఇవ్వడం ద్వారా ఫ్రీక్వెన్సీని జాగ్రత్తగా నిర్వహిస్తున్నామన్నారు. అలా చేయకుంటే పవర్‌గ్రిడ్ పతనమయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విద్యుత్ వినియోగాన్ని 24 గంటలు నిరంతరం పర్యవేక్షించేందుకు, లోడ్ మోనటరింగ్ సెల్‌ను ఏలూరు సర్కిల్ కార్యాలయంలో, ఆరు డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ లోడ్ మోనటరింగ్ సెల్‌లు, విద్యుత్ గ్రిడ్ ఫ్రీక్వెన్సీని 50 హచ్‌జెడ్‌లు ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనివార్య కారణాల వల్ల ఏదైనా విద్యుత్ అంతరాయం కలిగితే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సమస్య వెంటనే పరిష్కరించబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ ఎపిఇపిడిసిఎల్‌కు సహకరించాలని ఎస్ఇ కోరారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం మత్తు వైద్య నిపుణులు, రక్త నిల్వల కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ వి.రవిపాల్

హలో డాక్టర్

ప్రజాశక్తి - భీమడోలు

రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా గుర్తింపు పొందాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం మత్తు వైద్య నిపుణులు, రక్త నిల్వల కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ వి.రవిపాల్ కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పలు వివరాలు వెల్లడించారు.



ప్ర : జిల్లాలో రక్త నిల్వకేంద్రాలు ఎన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉన్నాయి?

జిల్లాలో భీమడోలుతో పాటు జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు, దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తనిల్వ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా భీమడోలులో మైనస్ 25 డిగ్రీల సెంటిగ్రేడ్ సామర్థ్యం గల బ్లడ్ స్టోరేజ్ ఫ్రీజర్ అందుబాటులో ఉంది.

ప్ర : భీమడోలు రక్తనిల్వ కేంద్రానికి ప్రధాన దాతలు ఎవరు?

సామాజిక ఆరోగ్య కేంద్రానికి స్వచ్ఛందంగా దాతలు నుంచి, వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించి ఏలూరులోని మదర్ బ్లడ్ బ్యాంక్‌కు తరలిస్తున్నాం. అవసరం మేరకు అక్కడి నుంచి కూడా శుద్ధి చేసిన రక్తాన్ని స్వీకరిస్తాము.

ప్ర : ఏలూరులోని రక్త మదర్ నిల్వ కేంద్రం, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రక్త నిల్వ కేంద్రం మధ్య సంబంధం ఏమిటి?

అక్కడ రక్తాన్ని వివిధ పరీక్షల ద్వారా శుద్ధి చేసి గ్రూపులుగా విభజించి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గల రక్తనిల్వ కేంద్రాలకు తరలిస్తారు.

ప్ర : భీమడోలులోని రక్త నిల్వ కేంద్రం ప్రత్యేకత?

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని బ్లడ్ కాంపోనెంట్ విభాగం ద్వారా ఆర్‌బిసి, ప్లాస్మా, ఎఫ్6, ఎఫ్8, తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా రోగులకు అవసరమైన రక్తాన్ని ఉచితంగా అందజేస్తున్నాం. బ్లడ్ స్టోరేజీ ఫ్రీజర్ ద్వారా డెంగీవ్యాధికి అవసరమైన ప్లేట్‌లెట్లు విభజిస్తామన్నారు. ప్రసవాలు, ప్రమాదాలు జరిగినప్పుడు రోగులకు రక్తాన్ని అందజేస్తున్నాం.

ప్ర : హోల్ బ్లడ్ ప్రత్యేకత ఏమిటి?

హోల్ బ్లడ్ విభాగం ద్వారా రక్తహీనత, డెలివరీలకు అవసరమైన ప్రత్యేక అవసరాలు గల రక్తాన్ని అందిస్తాం.

ప్ర : భీమడోలు రక్త నిల్వ కేంద్రం సామర్థ్యం ఎంత?

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 30 యూనిట్లు నిల్వ చేసే కేంద్రం ఉంది. ప్రతినెలా పది మందికి తక్కువ కాకుండా బయటి రోగులకు అవసరమైన రక్తాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యపరంగా ఉచితంగా అందజేస్తున్నాం. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల కాలంలో ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో రక్తానికి ఎక్కువగా డిమాండ్ ఉంది. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రక్తాన్ని రెండు నుంచి ఆరు నెలల పాటు నిల్వ చేసే అవకాశం ఉంది.

ప్ర : భీమడోలు రక్త నిల్వ కేంద్రం ఎప్పుడు నుంచి పనిచేస్తుంది?

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తనిల్వ కేంద్రం 2019లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సేవలను అందిస్తుంది.

ఇరికించాలని.. ఇరుక్కున్నారు

పోలీసులకు చిక్కిన ఇద్దరు గంజాయి, గుట్కా విక్రేతలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వ్యాపారస్తుల వద్ద పనిచేసి, వారు చేసే వ్యాపారం నేర్చుకుని వారిని జైలుకు పంపించాలని ఇద్దరు ప్రబుద్ధులు వేసిన పథకాన్ని రెండో పట్టణ పోలీసులు ఛేదించి అతన్ని కటకటాల పాల్జేసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి శివగోపాలపురానికి చెందిన అన్నదమ్ములు జూలూరి శేషగిరిరావు, జూలూరు గణేష్ నీలిమందు తయారుచేసి అమ్మే వ్యాపారం చేస్తున్నారు. గుట్కాల వ్యాపారం కూడా ప్రారంభించారు. వారి వద్ద ఏలూరు నగరంలోని లక్ష్మీవారపుపేటకు చెందిన గేదెల సతీష్, రాగి నాగేశ్వరరావు వ్యాన్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. 2020లో వ్యాన్ డ్రైవర్లు ఇద్దరు వారి యజమానుల వద్ద నుండి బయటకు వెళ్లిపోయి సొంతంగా గుట్కా వ్యాపారానికి తెరలేపారు. కరోనాకాలంలో గుట్కా వ్యాపారానికి చెక్ పడినప్పటికీ మరలా తిరిగి వారు గుట్కా వ్యాపారాన్ని ప్రారంభించారు. అయితే శేషగిరిరావు, గణేష్ ఏలూరు నగరంలో అతి తక్కువ ధరలకే గుట్కాలను విక్రయిస్తున్నారు. దీంతో సతీష్, నాగేశ్వరరావు వద్ద గుట్కాలను ఎవరూ కొనుగోలు చేయడం లేదు. దీంతో సతీష్, నాగేశ్వరరావు కలిసి శేషగిరిరావు, గణేష్ వద్దకు వెళ్లి ఏలూరు మొత్తంలో హోల్‌సేల్‌గా గుట్కాలు తమకే అమ్మాలని డిమాండ్ చేశారు. దీనికి వారు తిరస్కరించారు. దీంతో ఎలా అయినా అన్నదమ్ములను జైలుకు పంపించాలని వీరు నిర్ణయించుకున్నారు. సతీష్ పెద్దమ్మతో గంజాయిని తీసుకు వచ్చి శేషగిరిరావు ఇంటి వద్ద ఉంచితే పోలీసులు వారిని అరెస్ట్ చేస్తారని పథకం రూపొందించి, ఆ ప్రకారం ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్కూటర్‌పై సతీష్, నాగేశ్వరరావు దాదాపు 24 కేజీల గంజాయిని తీసుకువస్తున్నారు. అదే సమయంలో రెండో పట్టణ సిఐ చంద్రశేఖరరావు వాహన తనిఖీలు చేస్తుండగా వీరు పోలీసులకు చిక్కారు. అయితే సతీష్ అక్కడి నుండి పరారుకాగా పోలీసులు నాగేశ్వరరావును, అతని వద్ద 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సిఐ చంద్రశేఖర్ రావు, హెడ్ కానిస్టేబుల్ కనకాంబరం, ఏసుబాబు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచి

'మానవత' ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్‌లో స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సు ప్రయాణికులకు వేసవి పురస్కరించుకుని మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాతల సహకారంతో వేసవికాలం వెళ్లేంతవరకు కొనసాగించనున్నట్లు మానవత జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. మిగిలిన రోజుల్లో సంస్థ భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రం ద్వారా శుద్ధి చేసిన గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం దాత అల్లాడ ప్రసాదరావు సహకారంతో సుమారు 400 మంది బస్సు ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పంపిణీ కార్యక్రమానికి మానవత సభ్యులు ఉన్నమట్ల సత్యనారాయణ, గోపిశెట్టి హేమంత్, సిహెచ్.రాజు, ఎ.సురేష్ సహకారం అందించారు.

'మానవత' ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు

చింతలపూడి : మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమలు చేస్తానని ఆ సంస్థ ఏలూరు అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ చింతలపూడి శాఖ కార్యవర్గ నెలవారీ సమావేశం మండల అధ్యక్షుడు కె.నాగ చిన్నారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానవత జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అందరి సమక్షంలో మానవత చింతలపూడి శాఖ నూతన అధ్యక్షులుగా ఎర్రగుంటపల్లికి చెందిన పుల్లూరి సోమశేఖరాచార్యులుపు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ఆరినేపల్లి అప్పారావు, ముప్పిడి శామ్యూల్, అన్నవరపు రాజారావు, బివిఎస్ఎన్.రాజు, మన్యం సత్యకుమార్ పాల్గొన్నారు.

కైకలూరు అభివృద్ధిలో చిన్నచెరువు కీలకం


ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు గ్రామాభివృద్ధిలో చిన్న చెరువు కీలకమైందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన చిన్న చెరువుగట్టున ఉన్న వాటర్ ట్యాంక్ మెరక పూడిక పనులకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దానం మేరి నవరత్నకుమారి, వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, తోట మహేష్, వెంకటేశ్వరరావు, మురాల కృష్ణ, మురాల నాగమహాలక్ష్మి, పడమటి సీతారామాంజనేయులు, పిచ్చికల నాగరాజు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలోని వాలంటీర్లను కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతున్న వాలంటీర్లు సచివాలయ కన్వీనరత్లో, గృహసారధులతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజి, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న సర్పంచి

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచి విస్సంపల్లి జ్యోతి మజ్జిగ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, వడదెబ్బకు గురికాకుండా ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనమా వాసు, విసంపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ములగలంపల్లి శివారులోని పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడిచేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి రూ.17,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సిఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడిచేశారు.



అంబులెన్సులో క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారిపై మండలంలోని నాచుగుంట వద్ద శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గుడివాడకు చెందిన ఒక కుటుంబం అమలాపురం జిల్లా అయినవిల్లి గుడికి వెళ్లారు. తిరిగి గుడివాడ వెళుతుండగా నాచుగుంట వద్ద కారు అదుపుతప్పి పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు డివైడర్ దాటుకుని అవతలి రోడ్డు మార్గంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కారులో వారిని బయటకు తీశారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిధిలోని పెద్దగాంధీ బొమ్మ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్ రోడ్డు, హనుమాన్ జంక్షన్ రోడ్లలో శనివారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులు, తల్లిదండ్రులు కూడా శిక్షార్హులన్నారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

వేసవిలో దుక్కులు దున్నుకోవాలి

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు రబీ పంటకోత తర్వాత మళ్లీ వర్షాకాలం వరకు భూమిని దున్నకుండా వదిలేస్తారని, దీంతో కలుపుమొక్కలు పెరిగి భూమిలో నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమిలో సత్తువ లేకుండా చేస్తున్నాయని ఎఒ టికె.రాజేష్ అన్నారు. దీనివల్ల భూ సారం తగ్గిపోవడమే కాకుండా, భూమిలోని లోతైన పొరల నుంచి నీరు పైకి పీల్చుకోబడి ఆవిరైపోతోందన్నారు. పంట కోసిన వెంటనే తగినంత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా లోతైన దుక్కులు దున్నుకోవాన్నారు. సాధారణంగా వేసవి నెలల్లో అడపాదడపా కురిసే వానలను సద్వినియోగం చేసుకొని భూములను దున్నుకోవాన్నారు. వీటినే వేసవి దుక్కులు అంటారని చెప్పారు. వేసవి దుక్కులు లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి తెలిపారు.

ఘనంగా జెట్టి గురునాథరావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెట్టిగురునాధరావు అభిమానులు రక్తదానం చేశారు. అమ్మప్రేమ స్వచ్ఛంద సంస్థలో చిన్నారులకు, సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. నిత్యావసరాలను అదించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మెట్టప్రాంతంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెట్టిగురునాధరావు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిచడం వల్లే ఇంత ప్రజాభిమానం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, మంగరాజు, బాషా పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లోని జిల్లా, మండల, గ్రామ స్థాయి టిడిపి నేతలు, అభిమానులు తరలివెళ్లారు. రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

కైకలూరు : రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడుకు టిడిపి నేతలు తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పలు వాహనాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ముదినేపల్లి :టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో శనివారం మండలం నుంచి భారీగా టిడిపి నేతలు రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడు సభకు తరలివెళ్లారు. ముదినేపల్లిలోని కొడాలి వినోద్ కార్యాలయం నుంచి వివిధ వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా మహానాడుకు బయలుదేరి వెళ్లారు.

నేటి నుంచి కుంకుళ్లమ్మ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానానికి ఉపాలయమైన గ్రామదేవత కుంకుళ్లమ్మ వార్షికోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాధరావు తెలిపారు. యాత్రికులు ఈ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శిశువు విక్రయ కేసు ఆలస్యంగా వెలుగులోకి

నూజివీడు రూరల్:మండలంలోని ఓగిరాల తండాకు చెందిన పాడిత్యా మూర్తి, వసుంధర దంపతులకు గత ఏడాది నవంబర్‌లో మూడో కాన్పులో ఆడపిల్ల జన్మించింది. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలుండటంతో మూడో పాపను మధ్యవర్తి ద్వారా తణుకు ప్రాంతానికి చెందిన వారికి విక్రయించాడు. దీనిపై అధికారులకు ఈనెల 18వ తేదీన ఫిర్యాదు అందగా, 18వ తేదీన నూజివీడు రూరల్ పోలీసులకు ఐసిడిఎస్ సిడిపిఒ సూరాని ఫిర్యాదు చేశారు. దీంతో పాపను ఏలూరు శిశు గృహంలో ఉంచారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి అశోక్ కుమార్ తెలిపారు.

నేడు అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల సందర్భంగా కైకలూరులో ఈనెల 28వ తేదీన అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు పెనుమత్స త్రినాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక కోరుకొల్లు రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పార్టీ సీనియర్ నాయకులు రంగారావు ఆర్థిక సహకారంతో భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి-1 సచివాలయాన్ని ఎంపిడిఒ అలీఖాన్ శనివారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయం నుండి బయటకు వివిధ పనుల నిమిత్తం వెళుతుంటే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు